క్లుప్తంగా

నగరి కమిషనర్‌గా కృష్ణారెడ్డి



నగరి: మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మున్సిపల్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. నగరి కమిషనర్‌గా ఉన్న మంజునాథ్ గౌడ్ బదిలీపై వెళ్లడంతో వైఎస్ఆర్ జిల్లా కందుకూరులో ఎన్నికల విధుల నిమిత్తం కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కృష్ణారెడ్డి నగరి మున్సిపాలిటీకి విచ్చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ సంబంధిత అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

బీఎల్ఓలు వెరిఫికేషన్ పూర్తి చేయాలి



బీఎల్ఓకు సూచనలిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

పుత్తూరు: వడమాలపేట మండలంలోని బీఎల్‌ఓలు డోర్ టు డోర్ వెరిఫికేషన్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన బీఎల్‌ఓలతో కలిసి వడమాలపేటలో వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫారం 6, 6బి, 7, 8లకు సంబంధించి నమోదు ఉంటే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఆయా డోర్ నెంబర్లు ఆయా సెక్షన్‌లోనే ఉండాలని సూచించారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



నోటీసులు ఇస్తున్న డాక్టర్లు

పాలసముద్రం: ఆర్ఎంపీలు ప్రజలు వస్తే ప్రథ మ చికిత్స మాత్రం చేయాలని పాలసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారులు మోహన్ క్రిష్ణ, లోకేష్ తెలిపారు. శుక్రవారం బలిజకండ్రిగలో నిర్వహిస్తున్న ప్రైవేటు క్లినిక్‌లను వారు క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. వారితో డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ క్లినిక్‌కి వచ్చిన ప్రజలకు ప్రథమ చికిత్స చేసి, వారిని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి పంపాలన్నారు. అలా కాకుండా వారికి ఇంజక్షన్ వేసి మందులు ఇవ్వడం, రక్త పరీక్షలు చేయడం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నోటీసులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి పాల్గొన్నారు.

ఆలపాకంలో పారిశుధ్య పనులు



జేసీబీతో పిచ్చి మొక్కల తొలగింపు

విజయపురం: మండలంలోని ఆలపాకం పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ బాబు పారిశుధ్య పనుల చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు, పేడ దిబ్బలను తొలగించారు. మురికి కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. ఓవర్ ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించారు. తాగునీటి కొళాయి వద్ద ఉన్న బురదనీటిని తొలగించి బ్లీచింగ్ చేశారు.

ఆకాశ కన్నియమ్మకు విశేష పూజలు



అమ్మవారి సేవలో భక్తులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కోన చెరువు సమీపంలో వెలసిన ఆకాశ కన్నియమ్మకు శుక్రవారం అమ్మవారికుప్పం గ్రామస్తులు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యిలతో వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మండలానికి సరిహద్దులో ఉన్న అమ్మవారికుప్పం గ్రామస్తులు అమ్మవారికి కొత్త దుస్తులు వివిధ సుగంధభరిత పుష్పాలు సమర్పించారు. మహిళలు పొంగళ్లతో గ్రామం నుంచి ఊరేగింపుగా తీసుకునివచ్చి అమ్మవారికి సమర్పించారు. గ్రామస్తులు తీసుకునివచ్చిన చీర, సారెతో ఆలయ అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం మహిళలు వండిన పొంగళ్లను నైవేద్యంగా ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు పంచామృతం, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

చవితి సందడి

వినాయక చవితి సందడి మొదలైంది. పల్లె, పట్టణం, వీధి, కాలనీ అన్న తేడా లేకుండా వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు పూర్తయ్యాయి. శనివారం వినాయక చవితి సందర్భంగా పలుచోట్ల చలువ పందిళ్లు వెలిశాయి. రంగు రంగుల విగ్రహాలు దర్శనమిస్తుండడంతో ఈ విగ్రహాల కొనుగోళ్లకే యువత ప్రాధాన్యమిస్తోంది. మరోపక్క ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)తో తయారైన విగ్రహాల వినియోగం ఏమాత్రం ఆమోద యోగ్యం కాదని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. పీఓపీ విగ్రహాలకు వాడే రంగుల రసాయనాలు భూమిలో, నీటిలో ఇంకి జలవనరులు విషపూరితమవు తాయంటున్నారు. ఈ నీటిని తాగిన మూగజీవాలు, మనుష్యులు వ్యాధుల బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాని కలిగించే పీఓపీ విగ్రహాలను విడనాడి, మట్టి విగ్రహాలతో పండుగ జరుపుకుని, పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా మట్టి గణపతులు



విక్రయానికి ఉంచిన పత్రి సామగ్రి, మట్టి విగ్రహాలు



పుత్తూరు: వినాయక చవితి వేడుకలకు విగ్రహాలు సిద్ధమయ్యాయి. గణనాథుడి వేడుకలు ఘనంగా నిర్వహించాలని యువత ఉత్సాహంగా ఉరకలేస్తుండగా, విగ్రహాల తయారీనే నమ్ముకున్న వ్యాపారులు అమ్మకాలపై ఆశలు పెంచుకున్నారు. 2 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తుతో రంగు రంగుల విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే విగ్రహ కేంద్రాల వద్ద నచ్చిన బొమ్మలను తమ మండపాల వద్దకు తరలించారు. పుత్తూరు మండలం కళ్యాణపురం, మహాలక్ష్మీపురం, కేఎంఅగ్రహారం గ్రామాల వద్ద 70 కుటుంబాలవారు విగ్రహాలను తయారు చేసి, విక్రయిస్తున్నారు. ప్రతిఏటా ఫిబ్రవరి నెల నుంచి ఆరు నెలలపాటు విగ్రహాల తయారు చేసి ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చే వినాయక చవితికి అమ్మకానికి పెడుతారు. చవితి సందర్భంగా ఒక్క పుత్తూరులోనే రూ.50 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుంది. పుత్తూరు పట్టణంలోని దాదాపు అన్ని ప్రధాన వీధుల్లో విగ్రహాల ఏర్పాట్లు జోరందుకున్నాయి. మూడు, ఐదు, తొమ్మిది రోజులు వంతున చవితి వేడుకలు చేయడానికి ఆయా ఉత్సవ కమిటీలు పోటీపడుతున్నాయి. దీంతో పట్టణంలో చవితి సందడి సంతరించుకుంది.

చవితి పత్రి ప్రదర్శన

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. బోటనీ విద్యార్థినులు చవితి పూజలో సమర్పించే 21 పత్రుల ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో పత్రుల ఔషధ గుణాలను సందర్శకులకు వివరించారు. మట్టి వినాయక ప్రతిమల విశిష్టతను తెలియజేశారు. బోటనీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక పూజా కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బోటనీ అధ్యాపకురాలు పద్మావతి, సుజన తదితరులు పాల్గొన్నారు.

నగరిలో...

నగరి: వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు పట్టణంలో ఏర్పాట్లు శుక్రవారం ఊపందుకున్నాయి. బస్టాండు ప్రాంగణంలో చవితి సందడి నెలకొంది. చవితి రోజున మట్టితో చేసిన వినాయక ప్రతిమలను తెచ్చి పూజలు చేసి నీటిలో నిమజ్జనం చేస్తే ఆ విగ్రహం కరిగేలా విఘ్నాలు కూడా పోతాయన్నది ప్రతీతి. దీంతో వీధికో బొజ్జ గణపయ్యను స్థానికులు ఏర్పాటు చేసుకుంటున్నారు. రాత్రిపూట శిబిరాలు విద్యుత్ దీపాలతో కళకళలాడే ఏర్పాట్లు చేశారు. ఈ పండుగను స్థానికంగా 3 నుంచి 7 రోజులపాటు ఆనవాయితీగా నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రజలు నిర్వాహకులు ఉత్సాహంగా వినాయకుని విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్లు, బైకుల్లో వినాయకుని విగ్రహాలను తీసుకెళ్తున్నారు. పర్యావరణానికి సురక్షితమైన మట్టివినాయక ప్రతిమలకు డిమాండ్ ఏర్పడింది. వినాయకుని పూజకు అవసరమైన పండ్లు, పువ్వులు, పూజా సామగ్రి, గొడుగుల విక్రయాలతో పాటు ధరలు ఊపందుకున్నాయి. ఇండ్ల వద్ద వినాయక ప్రతిమలు ఉంచి పూజ చేయడంలో ఈ ప్రాంతం వారు పలు సాంప్రదాయాలు పాటిస్తారు. ఆనవాయితీ ప్రకారం కొందరు మట్టితో తయారుచేసి విక్రయించే ప్రతిమలను కొనుగోలు చేసి పూజిస్తే కొందరు అచ్చు వేసి తయారు చేసే వినాయక ప్రతిమలను వాడుతారు. కొందరు రంగుల వినాయక ప్రతిమను ఉపయోగిస్తే కొందరు స్వయంగా మట్టి తీసుకువచ్చి ఇంటివద్దే వినాయకుని ప్రతిమను తయారుచేసుకుని పూజించే ఆచారాన్ని పాటిస్తారు. ఇంకొందరు వినాయక ప్రతిమలను కొనుగోలు చేయక ఇళ్లలోని వినాయకుని ప్రతిమకే పూజలు జరుపుతారు.

మట్టి గణపతిని పూజించండి

కార్వేటినగరం: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో వినాయక చవతిని పురస్కరించుకుని ముందస్తు చవతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని గుర్తు చేశారు. ప్రతి ఇంటిలోనూ మట్టి గణపతిని పూజించడానికి ప్రయత్నించాలని పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో నష్టాలను వివరిస్తూ, భారతీయ పండుగల వెనుక పర్యావరణ పరిరక్షణ దాగి ఉందని, మట్టి గణపతిని పూజిద్దామని విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనుంజయరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాబు, ఎస్.కార్తీక్, జోగిప్రసాద్, మీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువుదీరనున్న గణేశుడు

కార్వేటినగరం: వినాయక చవితి ఉత్సవాలు శనివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. దేవాది దేవుడైన బొజ్జ గణపయ్య విగ్రహాలను కొలువుదీర్చేందుకు పల్లె, పట్టణాల్లోని వీధివీధిన మండపాలు నెలకొల్పారు. వినాయక విగ్రహ ప్రతిమలు ప్రతిష్ఠించేందుకు కొనుగోలు కేంద్రాలకు వస్తుండడంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోటీపడుతున్నారు. ఇంట్లో పూజల కోసం బొజ్జగణపయ్య విగ్రహాలను ప్రధాన గ్రామాల కూడళ్లలో విక్రయదారులు సిద్ధంగా ఉంచడంతో కొనుగోలుదారులతో రద్దీ నెలకొంది. నియోజకవర్గంలో కార్వేటినగరం, పుల్లూరు క్రాస్, కొత్తపల్లిమిట్ట, పచ్చికాపల్లం, వెదురుకుప్పం, చవటగుంట, పెనుమూరు, గంగాధరనెల్లూరు, పాలసముద్రం గ్రామాల్లో జనం పూజా సామగ్రి కొనుగోలు కోసం కిటికిటలాడారు. పట్టణాల నుంచి వివిధ అవతారాలతో తీర్చిదిద్దిన వినాయక విగ్రహాలను తరలిస్తూ యువత ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది.

వినాయక చవితికి విస్తృత ఏర్పాట్లు



ఎస్ఐ భారతి

పాలసముద్రం: వినాయక చవితి పురస్కరించుకుని మండల పరిసర గ్రామాల్లో శుక్రవారం చవితి పందిళ్ల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక స్వరాజ్య గ్రామాల్లో కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈ పండుగకు నిర్వాహకులు పండుగ సమయానికల్లా పూర్తిచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏటా మండల పరిసర ప్రాంతాల్లో చవతి నిర్వహించే ఉత్సవాలకు విభిన్న కోణాల్లో భక్తులకు ఆకర్షించే విధంగా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవతి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటుకి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ భారతి చెప్పారు. పూర్తి వివరాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి అనుమతి పొందాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతి కూడా తీసుకోవాలన్నారు. వినాయక చవితి పందిళ్ల వద్ద ముందస్తు జాగ్రత్తగా ఇసుక నీళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలు వరకు మాత్రమే లౌడ్‌స్పీకర్లు నిర్వహించుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా పూర్తి బాధ్యత కమిటీ సభ్యులు, కార్యనిర్వాహకులే వహించాల్సి ఉంటుందని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య



పత్రి ఔషధ గుణాలను వివరిస్తున్న విద్యార్థినులు



బస్టాండు ప్రాంగణంలో పూజా సామగ్రి విక్రయాలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



కాసా సంస్థ ఆధ్వర్యంలో కోడి పిల్లల పంపిణీ

గంగాధరనెల్లూరు: పేద ప్రజల జీవన విధానంలో మౌలిక సదుపాయాలు అందించి, ఆర్థికంగా బలపరచడమే కాసా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ దక్షిణ భారత జోనల్ ఆఫీసర్ కరుణాకరన్ అన్నారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని సహకార బ్యాంకు ప్రాంగణంలో కాసా సంస్థ 75 వసంతాల సందర్భంగా పేద ప్రజలకు పెట్టుబడి సహాయం కింద కుటుంబానికి 10 నాటు కోడి పిల్లలు, వర్మీ కంపోస్టు ప్లాస్టిక్ పిట్ బ్యాగు, వానపాములు, అజోలా ఉచితంగా అందించారు. మండలంలోని దాదాపు 300 కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పేదవారిని ఆర్థికంగా బలపరచడానికి కాసా సంస్థ 75 సంవత్సరాలుగా పనిచేస్తోందని, పెట్టుబడి సహాయం కింద అనేక వేలాదిమందికి సహాయ సహకారాలు అందించాలని, పేదవాడిని ఆర్థికంగా బలవంతుడిగా చేయడమే కాసా సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల అధికారులు తహశీల్దార్ చంద్రశేఖర్, వెటర్నరీ ఏడీ మురళీమోహన్, అగ్రికల్చర్ ఏవో భవాని, మండల సర్వేయర్ గణేష్, హార్టికల్చర్ ఏవో లోకేష్ , సంస్థ ప్రతినిధులు నాగరాజు, శశికళ, ఉష, ప్రభు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ



ఇల్లత్తూరులో సర్వే

విజయపురం: మండలంలో ఓటర్ల జాబితా సవరణ వేగవంతంగా సాగుతోంది. శుక్రవారం బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పులు సవరణ కార్యక్రమాలు చేపట్టారు. అక్టోబరు 18వ తేదీ నాటికి ఆయా పనులన్నీ పూర్తి చేయాల్సి ఉంది. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు, జీరో ఇంటి నెంబర్లతో ఉన్నవాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అక్టోబరు 29వ తేదీన ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. దీనిపై సవరణలు, అభ్యంతరాలను నవంబరు 28 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 24లోపు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. జనవరి 6న తుది జాబితా ప్రచురితమవుతుందని అధికారులు తెలిపారు.

మాజీ మంత్రికి జాతర కమిటీ ఆహ్వానం



జాతర నిర్వాహకులకు చీర,సారెను అందిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: గంగజాతర ఉత్సవాలకు జాతర కమిటీ సభ్యులు శుక్రవారం మాజీ మంత్రి ఆర్కే రోజాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల ఉత్సవాలకు చీర, సారెను మాజీ ఆలయ కమిటీకి ఆమె అందించారు. ప్రతి ఏడాది జాతర సందర్భంగా గ్రామదేవతలు దేశమ్మ, ఓరుగుంటాలమ్మలను ప్రత్యేకంగా అలంకరించడం పరిపాటి. ఈ మేరకు అమ్మవారికి అలంకరణకు సంప్రదాయ బద్ధమైన పట్టుచీరలు, పసుపు, కుంకుమ, గాజులు, పసుపుదారాలు, పండ్లను తన స్వగృహం వద్ద ఆలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామ దేవతల చల్లని చూపు నగరి ప్రజలకు సుఖసంతోషాలను అందించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను జాతర నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, దయానిధి, బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మదనశ్రీనివాసన్, కోలా బాలాజీ, రాజేష్, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, వైస్ ఎంపీపీ కన్నియప్ప, వేణుబాబు, మురుగ, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో ఎద... గుర్తించక పోతే వ్యథ

ఆడ పశువులు యుక్త వయస్సుకు వచ్చిన తర్వాత అండాశయంలో ఉత్పత్తి అయిన హార్మోన్ల ప్రభావంతో ఎద లక్షణాలను వ్యక్తం చేస్తాయి. వీటిని గుర్తించి సకాలంలో కృత్రిమ గర్భధారణ చేయించడం పునరుత్పత్తి యజమాన్యంలో అత్యంత కీలకం. చాలా మంది పాడి రైతులు ఎదను సరిగా గుర్తించకలేక నష్టపోతున్నారు. ఒక ఎద తప్పినా వాటి పునరుత్పత్తి జీవిత కాలంలో నెల తగ్గిపోతుంది. నష్టం విలువ వెయ్యి నుంచి పదిహేను వందల వరకు ఉంటుంది. అందుకే పశువుల ఎద కాలాన్ని సూచించే లక్షణాలను ప్రతి పాడి రైతూ తెలుసుకుని ఉండాలి. ఈ లక్షణాలను ఎలా గిర్తించ వచ్చో ఏరియా పశువు సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.వాసు ఇలా చెబుతున్నారు.

– కార్వేటినగరం

- ఎద తప్పితే పునరుత్పత్తి తగ్గుదల
- పాడి రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- ఏరియా పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వాసు



ఎదకు వచ్చిన ఆవును పరిశీలిస్తున్న పశు వైద్యులు


• మూగ ఎద

ఎద లక్షణాలు కనిపించకుండా పోవడమే మూగ ఎద అంటారు. ఇది గుర్తించడం కష్టమే. కానీ జాగ్రత్తగా గమనిస్తూ ఉంటే సులువుగానే కనిపెట్టొచ్చు. గేదెలు 50 శాతం మూగ ఎదలోనే ఉంటాయి. ఆ సమయంలో అవి కీచుగా అరుస్తాయి. దగ్గరనున్న పశువుల్ని, మనుష్యులను బెదురుగా చూస్తాయి. గేదెలు మార్చి నుంచి ఆగస్టు నెల్లో ఎదకు వస్తాయి. ఈ మధ్యకాలంలో మూగ ఎద లక్షణాలను గుర్తించడానికి రోజుకు పది నిమషాలు గేదెల ప్రవర్తనను గమనించాలి. ఎండాకాలంలో ఎద లక్షణాలు అన్నీ కనిపించవు. సరైన పోషణ లేని గేదెల్లో అసలు ఆ లక్షణాలే కనిపించవు. సుమారు 50 శాతం గేదెల్లో పునరుత్పత్తి సమస్యలు ఎద లక్షణాలను గుర్తించక పోవడంతోనే కలుగుతాయి.

పాడిపశువుల్లో వచ్చే ఎదను జాగ్రత్తగా గమనించాలి. మూగ ఎదకు వచ్చే పాడి పశువుల్లో ఎదకాలం సాధారణం కన్నా ఎక్కువ కాలం ఉండొచ్చు. అవసరమైతే కృత్రిమ గర్భధారణ చేసిన ఆరు గంటలు తర్వాత మళ్లీ గర్భధారణ చేయించాలి. గేదెలు లేదా సంకరజాతి పశువుల్లో ఎదకు వచ్చిన 7, 10 రోజుల్లో మళ్లీ ఎదకు వస్తే గర్భధారణ చేయించాలి. పాడి పశువులు ప్రతి 25 రోజులకు ఒకసారి ఎదకు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో 3 నుచి 5 నెలల చూడి కాలంలో ఎదకు వస్తాయి. దీనినే చూడి ఎద అంటారు. ఆ సమయంలో వీటికి గర్భధారణ చేయించరాదు.

• ఆవుల్లో ఎద లక్షణాలు

ఆవుల్లో ఎదకాలం 18 నుంచి 24 గంటలు ఉంటుంది. సాధారణంగా ఎదకాలాన్ని మూడు దశలుగా విభజించారు. ఎదకు వచ్చిన ఆవులు తొలిదశలో మంద నుంచి వేరుపడి చికాకుగా ఉంటాయి. ఆకలి మందగించడంతో మేత సరిగా తినవు. మధ్య దశలో ఇతర ఆవులతో కలసి ఉన్నా చికాకుగానే ఉంటాయి. ఈ దశలో ఆకలి బాగా పడిపోతుంది. చివరి దశలో చికాకు తగ్గిపోతుంది. మేత మాములుగానే ఉంటుంది. తొలిదశలో పాల ఉత్పత్తి తగ్గుతుంది. మధ్య దశలో పాలు బాగా తగ్గిపోతాయి. చివరి దశలో మామూలు స్థితికి వచ్చేస్తాయి.



డాక్టర్ ఆర్.వాసు

• గేదెల్లో ఎద లక్షణాలు

తరచూ చిరుమూత్రం పోసే గేదెలు ఎదలో ఉన్నట్లు గుర్తించాలి. కొన్ని ఐదు నిమషాలకు నాలుగు, ఐదు సార్లు మూత్ర విసర్జన చేస్తాయి. గేదెల్లో ఎద లక్షణాలు 24 నుంచి 36 గంటల పాటు ఉంటాయి. ఈ సమయంలో గేదె చికాకుగా ఉంటూ మేత తినడం మానేస్తుంది. మానం తెరిచి చూస్తే లోపలి పొర ఎర్రగా ఉంటుంది. పాడి గేదెలు ఎదకు వచ్చినప్పుడు పాలు తగ్గుతాయి.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన



ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న ఆశిష్‌గుప్తా బృందం

పుత్తూరు: జిల్లాలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం భారత గ్రామీణాభివృద్ధి డిప్యూటీ సెక్రటరీ ఆశిష్‌గుప్తా పరిశీలించారు. వడమాలపేట మండలం కదిరిమంగళం గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ కార్యక్రమం కింద సాగవుతున్న కొబ్బరి, జామ, మామిడి తోటలను పరిశీలించారు. వడమాలపేట గ్రామంలో పంట సంజీవని ఫారంపాండును, కల్లూరు అమృత సరోవర్ చెరువు అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బాధ్యతగా పని చేయాలి



శ్రీకావేరిరాజుపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయానికి పలు సమస్యలతో వచ్చిన వారితో స్నేహంగా మెలగి, వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య లోపం, దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రీన్‌అంబాసిడర్లు తాగునీటి ట్యాంకులను శుభ్రంగా చేసి, క్లోరినేషన్ చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శ్రీకావేరిరాజుపురం సచివాలయంలో క్లోరినేషన్ రిజిస్టర్‌ని తరవుగా పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్ గురవయ్య, ఇంజినీర్ అసిస్టెంట్ నాగరాజు, పాల్గొన్నారు.